

## ఈ వారం తెలుగు పుస్తకం

# ఆర్. వసుంధరాదేవి కథలు




**Author:** R. Vasundhara Devi
**Subject:** Short Stories
**Year of Publication:** 2000
**Price:** US$ 3.47

పి. రామకృష్ణ

ఒకప్పటి 'భారతి' పాఠకులకు వసుంధరాదేవి కథలు ఇప్పటికీ జ్ఞాపకం వుంటాయి. ఆమె కథల్లో ఎక్కువభాగం 'భారతి'లో వచ్చినవే. ఆ విధంగా వసుంధరాదేవి కథల్ని భారతీ, భారతిని వసుంధరాదేవీ పరస్పరం గౌరవించుకున్నారనుకోవాలి. కథా సంకలనాలలో మళ్లీ మళ్లీ కనిపించకపోయినా, ఒక్కసారి చదివితే, మరచిపోలేనివీ, మరచిపోనివ్వనివీ వసుంధరాదేవి కథలు. అటువంటి అవకాశాన్ని ఒకప్పటి పాఠకులకే పరిమితం కానీక, ఇప్పటి పాఠకులక్కూడా కలిగించాలన్న సత్సంకల్పమే ఈ సంకలనం.

ఇంతకు ముందు వెలువడిన 'గాలి రథం', 'నీడలు' సంకలనాల్లో వచ్చిన కథలూ, వాటిల్లో రాని కథలూ, మొత్తం, 48 కథలు ఈ సంకలనంలో వున్నాయి. దీనిని, వసుంధరాదేవి కథా సర్వస్వం అనవచ్చు. ఇంతటి సమగ్ర సంకలనాన్ని వసుంధర పబ్లికేషన్స్ ద్వారా తేవడానికి కారకులైన వారందరికీ అభినందనలూ, కృతజ్ఞతలూ తెలియజేయడం, ఆ తరం ఈ తరం పాఠకుల బాధ్యత.

సంకలనంలో మొట్టమొదటిదైన 'చెరువుదగ్గర' కథే పాఠకుల్ని వసుంధరాదేవి దగ్గరికి తీసుకెళ్లి, ఆమె చెప్పేమాటల్ని శ్రద్ధగా వినేట్టూ, ఆ మాటలు బొమ్మకట్టే అర్థాన్ని బుద్ధిగా చూసేట్టూ చేస్తుంది. నిజానికి సుశీలమ్మకానీ, ఆమె భర్త గోపాలరావుకానీ ఈ కథలో ప్రధాన పాత్రలు కాదు. ఎనభైఏళ్ళ, మోకాళ్ళనొప్పుల కురవలింగప్పే కథానాయకుడు - బుక్కరాయసముద్రం చెరువులాగా సుశీలమ్మకు అనిపించిన లింగప్ప, కథ చదివాక పాఠకులకూ అలాగే కనిపిస్తాడు. లింగప్పమాటలు నిస్పృహతో, నిరాశతో నిండిన ముసలికబుర్లు కావు. "ముసలితనం, నొప్పులూ అన్నీ విడిపోయిన ఒక జీవవాహిని" అవుతాడు. "తన బంధువుల్నీ" వంశచరిత్రనూ, యర్రగడ్డనూ, అందులోని వనాంతరాల్నీ, దేవుళ్ళనూ, దేవుళ్ళకు జరిపిన పరసల్ని, తాను తిరిగిన దేశాల్ని, వాసనా జీవులైన జంతువుల్ని, మనిషిజాతిని, దాన్నినడిపే ధర్మాన్ని అన్నిటినీ ఆక్రమించుకుంటూ పెరుగుతాడు లింగప్ప".

మనుషులెవరూ లింగప్పకు చేసిన సహాయమేదీలేదు. ఇతర్ల సంగతి పోనీ, కొడుకు వోబులేశు సంపాయిస్తున్నా పైసా సాయం చెయ్యడు తండ్రికి. అయినా, లింగప్పకు మనుషులమీద మహాప్రేమ. బతుకు మీద ప్రశ్నల్లేని గౌరవం. "మీ వూరి మీద సినుకులు పడ్డయ్యా? వంకలుబారినయ్యా? సెరువుకు నీల్లు ఎన్ని మెట్లొచ్చినై?" అని, పక్కవూరి మనిషిని తన అక్కరైనట్టు పలకరిస్తాడు. "మా పెద్దోల్లు, నాయనలు, పెదనాయనలు, గుంపు పెద్దది, యాభైమందిలు. మా

వొమిశానికంతా నేను మిగిల్నాను. మా మేనమామ ఇంటికి ఒకడు మిగిల్నాడు. తక్కిన జనాలు యాడబోయినారో! ఎవరు సచ్చినా ఎనక్కితీసేదిలే, పదా అనేదే".

"అప్పడీ వూరు ఎంతుంది? పాతూరే. జీనియర్ కాలోజి వుండే సోటు అడివి. చెట్టుపలం జాత్తి. సరిసాకం రూపాయికిత్తా తీసుకోమని సుబ్బయ్య బంగపాయె. నాకెందుకీయడివిలో అని తీసుకోకపోతి. ఇంజినీరు కాలోజి దగ్గర ఎకరా అయిదు రూపాయలకిత్తా, మీ కురవోళ్ళకి పనికొత్తాదని కుప్పాశారి అడుక్కునె. మనిషీ మానూలేని ఎబ్బెట్టు సోటని వొద్దనేత్తి''. ఈ విధంగా అనంతపురం 'అభివృద్ధి' చరిత్రను వివరిస్తాడు నిర్వికారంగా. తాను అభివృద్ధి చెందలేకపోయానన్న చింతకానీ, పశ్చాత్తాపంకానీ వుండదు. లింగప్పకు సుఖం, దుఃఖం, చావు, బతుకు వేరు వేరు కావు. జీవితంలో భాగమే.

అందుకే, ఊహించని పిడుగులాంటి ఆపద, అపవాదు సుశీలమ్మపై బడి, తన అనుకున్న వాళ్ళెవరూ తను బతికివుండాలని కోరనప్పడు, సుశీలమ్మ కూడా తను చచ్చిపోయేందుకు ఏవిషమో తెచ్చి పెట్టమన్నపుడు....

"ఏలనమ్మా! ఊరికే సత్తానంటావు? ఈ ఊల్లో వుండలేకపోతే మావోల్ల కాడికి కుంటిమద్దికి పంపిత్తా. మా కోడలి సుట్టపురాలివని యాదోనే సెప్పకుంటా, నీకేల అదంతా. బతకటానికి సోటేలేదా?" అనగలిగాడు. మనుషులందరూ చావొచ్చే దాకా బతకాలనుకోవడం తప్ప, లింగప్పకు మరొకటి తెలీదు.

తను ఎవర్ని చూసి గర్వపడిందో, ఎవరిపక్కన కారులో కూచుని ఉన్నత శిఖరాలనధిష్ఠించినట్లు ఊహించిందో, ఆ 'భర్త' తనవైపు కన్నెత్తి చూడలేదు. అతని మీద వున్న కసితోనే ఆ దుర్మార్గులు ఆమెను అవమానించారన్న జ్ఞానం కూడా లేకుండా, ఆ 'మగవాడు' అమెనింకా ఎక్కువగా బాధించాడు. అందుకే, సుశీలమ్మ చెరువుదగ్గర మట్టిలో మట్టిగా, ప్రకృతిగర్భంలోకి చేరిపోయింది. సుశీలమ్మ ఎట్లా చనిపోయింది, అన్న ప్రశ్న అనవసరం. తను బతికినా మరణించినట్టేననుకుంది ఆమె. "ఇన్నాళ్ళు నిజమని నమ్మిన నాగరికత నాకు న్యాయం చెయ్యలేదు" అని గ్రహించింది ఆమె. గోపాలరావుల నాగరికత తనకు న్యాయం చెయ్యలేదు కానీ, 'వెర్రిముసలాడు' అనుకున్న లింగప్ప నాగరికత తనకు నాయ్యం చేయాలనుకుందని కూడా ఆమె గ్రహించింది. అయితే, ఇప్పడు న్యాయంతో అవసరం లేనంత అన్యాయం జరిగింది తనకు. అందుకే, ఇక సుశీలమ్మ మనిషిగా, గోపాలరావు భార్యగా వుండదు.

ఈ కథలో, లింగప్పను చూసాక, "లింగప్పా, నిన్ను మరిచిపోలేమప్పా" అని చెప్పాలనిపిస్తుంది. "తల కిందికి దించేసి, బుజాలు ఎగిరి పడేలా నవ్వు"తున్న లింగప్ప ఎదురుగా కనిపిస్తూ, మనల్నీ నవ్విస్తాడు. సుశీలమ్మ చెరువు దగ్గర మరణించే ముందు, చెరువు ఎండిపోయి కనిపించింది. వసుంధరాదేవి ఈ అభివర్ణన, లింగప్ప అనే చెరువు మాత్రం ఎండిపోలేదని సూచించడానికే అనిపిస్తుంది. ఒక తాత్త్విక స్థాయితో, అంతర్మథనంతో వుండే పాత్రల చిత్రణను ఇష్టపడే వసుంధరాదేవి, లింగప్ప వంటి పాత్రను ఇష్టంతోనూ, నిశిత పరిశీలనతోనూ చిత్రించడం ఆనందాన్ని కలిగిస్తుంది.

'గాలిరథం' 'ఇంతేలే పేదల ఆశలు' అనే రెండు కథలూ పేదల జీవితాలను చిత్రించినవి. ఎనిమిదేళ్ళ వల్లీకి అమ్మ చనిపోయింది. వల్లీ అమ్మ ఫాతిమా, వల్లీ తండ్రి బాబాసాబ్‌కు మూడో భార్య. ఫాతిమాకు ముందు ఇద్దరు భార్యలు చనిపోయారు. ఫాతిమా బతికివున్నప్పడు, బాబా సాబ్ ఆమెను కొట్టి, తిట్టి డబ్బులు లాక్కుని వెళ్ళి తాగివచ్చేవాడు. అక్క మెహర్‌భర్త రసూల్ కూడా దొంగతనాలు చేస్తూ, జులాయిగా తిరిగేవాడే. అమ్మ చనిపోయాక, వల్లీ తిన్నాడో పస్తున్నాడో పట్టించుకున్నవాళ్ళులేరు. ఎక్కడైనా కూలిపని చేద్దామనుకుంటే, అక్కడా పెద్దవాళ్ళయిన కూలీలూ, 'కాటా' (జులాయిరకం) వాళ్ళూ వల్లీని కొట్టి డబ్బులు లాగేసుకుంటారు. ఆఖరికి బావ రసూల్, కాకా ఓటల్లో చేర్పిస్తాననీ, అక్కడ కావల్సినంత తిండి దొరుకుతుందనీ చెబుతాడు.

"అరె వల్లీ! పాపం, పున్నెం మంచీ సెడ్డా ఏం లేవురా. అవన్నీ సదూకున్నోళ్ళు మాట్లాడేవి" అని హితబోధకూడా చేస్తాడు. అయితే, సదూకోని తమలాంటి నిరుపేదల్ని ఎవరు పోషిస్తారు? "రాతికీ రాతికీ మద్దెన పుట్టే చెట్టుకు ఎవరు పోషణ చేస్తారు? ఆగాలీ, ఆదేవుడూనూ".

ఇప్పుడు మైనారిటీలలో చైతన్యం పెరిగి, 'వతన్' లాంటి కథా సంకలనాలు వెలువడుతున్నదశలో, 'గాలిరథం' కథని ప్రశ్నించకుండా ఆమోదిస్తారనిపించదు. బాబా సాబ్‌కు ఫాతిమా మూడోభార్య కావడమూ, బాబా సాబ్‌కాక అల్లుడు రసూల్ కూడా జులాయిరకం కావడమూ సహించినా, వల్లీ లాంటి వాళ్ళ బతుకుల్ని గాలికీ, దేవుడికీ వదిలెయ్యడమేనా... అనడగవచ్చు. వల్లీ కాకాహోటల్లో చేరి రెక్కలు ముక్కలు చేసుకోవలసినప్పుడు, దేవుడు పోషిస్తాడని వేదాంతం చెప్పడమెందుకు అనడిగితే, జవాబు చెప్పడం కష్టమే అవుతుంది.

గౌరి నలుపైనా చక్కగా వుంటుంది. పనిలో చురుకైనదీ, కష్ట పడటం అలవాటైనదీ. అందుకే "కొండయ్య అదృష్టవంతుడు. మంచి పెళ్ళాం దొరికింది" అన్నారందరూ. గౌరి కల అంతా సొంత ఇల్లు ఏర్పాటు చేసుకోవాలన్నది. దానికోసం భార్యా భర్తలిద్దరూ నానా కష్టాలు పడి, అయినవాళ్ళ నిష్ఠూరాలనెదుర్కొని, కొంత డబ్బు పోగు చేసుకుంటారు. ఇంతలో గౌరి గర్భవతై బలహీనపడినా, డాక్టర్ చెప్పిన మందులు కొంటే డబ్బు ఖర్చవుతుందని కొనకుండానే నెట్టుకొచ్చిందికానీ, కాన్పు అప్పుడు తప్పలేదు. అర్భకపు ఆకారంతో పుట్టిన సుబ్బడి మందూమాకులకూ, మరికొంత ఖర్చయింది. ఈ లోపల కొండయ్య అన్న దగ్గరుండిన తల్లి అక్కడ జరుగుబాటు లేక కొండయ్య దగ్గరికి రావడమూ, కొండయ్య చిన్నక్క కూతుర్తో సహాదిగి కొన్నాళ్ళుండటమూ... ఇటువంటి వాటితో, ఇంకొంచెం ఖర్చయింది. ఇంకో వైపు ఇళ్ళస్థలాల ధరలు వాళ్ళకు అందకుండా పెరిగిపోయాయి.

ఇటువంటి స్థితిలో, ఒక రోజు మధ్యాహ్నం అన్నంగంప నెత్తిన బెట్టుకొని పొలాలవెంట పోతున్నప్పుడు, చింత చెట్టుమీద వుండిన 'దయ్యం గౌరిని ఆవేశించింది. ఆ దయ్యాన్ని వదలగొట్టేందుకు ఇంకో వూళ్ళో వున్న మాంత్రికురాలివద్దకు రాకపోకలు సాగిస్తోందిప్పుడు గౌరి. బస్సు చార్జీలకు, టెంకాయ, కర్పూరం లాంటివి కొనడానికీ కొత్త ఖర్చు తోడయింది. అన్నిటికీ కొండయ్య ఒక్కడికూలే ఆధారమయింది. అయినా, ఇప్పుడు గౌరి ఆలోచనంతా దయ్యం బాధ నుంచి తప్పుకోవడం మీదనే వుంది, ఆ పీడనొదిలించే మాంత్రికురాలి దయ మీదనే వుంది. వీలైతే, ఆమెకో చీరెను కానుకగా ఇవ్వాలనుకుంది. ఇప్పుడు ఇల్లు ఏర్పాటు చేసుకోవాలని లేదు. సుబ్బడి భవిష్యత్తును గురించిన ఆలోచనాలేదు.

'ఇంతేలే పేదల ఆశలు' అన్న ఈ కథ, పేదలకు భౌతికమైన ఆశలు నెరవేరే అవకాశం కాదు, ఆశలను పెట్టుకునే అవకాశం కూడా వుండదని తెలియజేస్తుంది. శీర్షిక, శ్రీశ్రీ అనువాద కవితలోని 'ఇంతేలే పేదల బతుకులు' అన్న చరణాన్ని జ్ఞాపకం చేస్తుంది. మద్యం తాగే అలవాటు పేదలకూ, ధనవంతులకూ వున్నప్పటికీ దాని ప్రభావం పేదలమీద వేరుగా వుంటుంది. అలాగే, మూఢనమ్మకాలు పేదలకూ, ధనవంతులకూ వున్నా, అవి పేదల జీవితాల్ని మాత్రమే ఛిన్నాభిన్నం చేస్తాయన్నవిషయాన్ని కూడా ఈ కథ సూచనాత్మకంగా తెలియజేసింది.

ఈ రెండు కథల్నీ వసుంధరాదేవి కాక, ఇంకెవరైనా రాయగలరు. ఆమె మాత్రమే రాయగలిగిన కథ ఏది?... అని ప్రశ్నిస్తే 'పెంజీకటికవ్వల' అనే పెద్ద కథ అని చెప్పవలసి వుంటుంది. అది వసుంధరాదేవి వ్యక్తిత్వమూ, ఆలోచనలూ ప్రస్ఫుటంగా ప్రతిఫలిస్తున్న కథ. "పెంజీ కటికవ్వల నెవ్వండే కాకృతి వెలుంగునతనినేసేవింతున్" అన్నాడు పోతన్న. పెంజీకటికవ్వల ఒక పురుషాకృతిని పోతన్న చూస్తే, ఆకృతిలేని వెలుగుని వసుంధరాదేవి, అంటే ఈ కథలో విజయలక్ష్మి చూడగలిగింది.

విజయలక్ష్మీ, ఆమె భర్త సీతారామారావు, వారి ఇద్దరు కూతుర్లూ ధనవంతుల ప్రాంతమైన శ్రీనగర్ కాలనీలో వుంటున్నారు. అన్ని సుఖాలూ అందుబాటులో వుండే ఆ శ్రీనగర్‌కాలని వెనకాలే పెద్ద శ్మశానం వుంది. రోజూ ఎన్నో శవాలు దహనానికో, ఖననానికో అక్కడికి చేరుతూ వుంటాయి. బహుశా, ఈ సుఖ దుఃఖాల ద్వంద్వ వాతావరణంలో వుండబట్టే నేమో, విజయలక్ష్మి స్వభావంలో ద్వంద్వ వైఖరులు ఏర్పడింది.

"ఒక్కోసారి ఆమెకు చాలా సంతోషంగా వుంటుంది. భర్త మీద, బిడ్డల మీద, కనిపించిన ప్రతి ప్రాణిమీద ప్రేమ పెల్లుబికివస్తుంది".

"ఒక్కోసారి జీవితం నిస్సారంగా, నిరర్థకంగా కనిపిస్తుంది. భర్త, బిడ్డలు లోకంలోని ప్రతి బంధమూ అవసరాలకు పరిమితమైనదిగా, స్వార్థపూరితంగా తోస్తుంది. మంచితనం, దయ, ప్రేమ అన్నీ మోసం అనుకుంటుంది".

ఈ ద్వంద్వ వైఖరులు ఆమెస్వభావానికి రెండంచులుగా నిలిచాయి. ఈ అంచుల మధ్యనే ఆమె ఆలోచనల సంచారం. "జీవితానికి అర్థం, లక్ష్యం అయి అతి ముఖ్యమైన 'అది' క్షీరార్ణవశాయి యైన విష్ణువులాగా దుఃఖసముద్రం మధ్యన అందరాకుండా నిలిచివున్నది. దాన్ని పట్టుకోవాలి... పట్టుకోవాలి. ఏమిటది? తనను బతకనివ్వకుండా, ఊపిరాడనీకుండా లాక్కుపోతున్నది ఏమిటది? మృత్యువా?" - ఇటువంటి ఆలోచనతో ఆమె విపరీతంగా ప్రవర్తిస్తోంది.

మెదడూ శరీరమూ ఎదగక అర్భకంగా వెర్రిదానిలా వుండే ఆరేళ్ళకూతురు చంద్రికమీద భర్తకేమాత్రం ప్రేమ కానీ, శ్రద్ధ కానీ లేదని బాధపడుతుంది. ఏడాది క్రితం 'కరెంట్ షాక్' నుంచి ప్రాణాలతో బయటపడినప్పటినుంచీ మనశ్శరీరాలమీద మృత్యుభయం వ్యాపిస్తోంది.

"అతిగా ఆలోచించటం ఆరోగ్యకరంగాదు జయా! ఎందుకు వూరికే లేనిపోనివి ముందువేసుకుని బాధపడతావు? జీవితాన్ని ఒప్పుకోలేక అనవసరపు ఊహలతో బాధను పెంచుకుంటూ పోవడం మంచిది కాదు. నవ్వటం నేర్చుకో" అంటాడు సీతారామారావు. "అయ్యో, జీవితమే దుఃఖసముద్రం అయివుండగా నవ్వటానికి వీలెక్కడుంది?" అదీ జయలక్ష్మిస్థితి. సీతారామారావు చిన్నాన్న వెంకటప్ప క్యాన్సర్ వ్యాధితో బెంగుళూరు ఆస్పత్రిలో చేరితే, సీతారామారావుతో పాటు జయలక్ష్మి కూడా క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్ళింది. అక్కడి రోగుల ముఖాలను పరిశీలనగా చూసింది. మృత్యుముఖంలో వున్నవాళ్ళని ఏదో అడగాలనీ, ఇంకెవరికీ తెలీనిదీ, వాళ్ళకు మాత్రమే తెలిసిందీ అయిన నిగూఢ విషయాన్ని తెలుసుకోవాలన్నది ఆమె అన్వేషణ.

"మేము చచ్చిపోయేవాళ్ళమని మీరు అనుకుంటున్నారు కదా అన్నట్లున్నవి వాళ్ళ చూపులు. అందుకే అందర్నీ అలా చూస్తున్నారు" అంది చిన్నగా సీతారామారావుతో. "మనిషన్న ప్రతివాడూ చనిపోయే వాడే. వాళ్ళు అట్లా అనుకోవాలని నీ ఉద్దేశం" అన్నాడతను. ఈ ఇద్దరి రెండు మాటలూ కథకు చాలా కీలకమైనవనవచ్చు. ఒకరిది మృత్యువును గురించి ఊహించిన భయమైతే, మరొకరిది మృత్యువు జీవితానికి అనివార్యమైనదన్న అంగీకారం. ఆ విధంగా తన భయాన్ని ఆక్షేపించి, వెక్కిరించిన భర్త మీద కోపం వచ్చింది జయలక్ష్మికి. "ఇతనితో ఇక ఎప్పుడూ ఏమీ అనకూడదు" అన్న రోషానికొచ్చింది.

తాము మృత్యువుకు దగ్గరగా వున్నామన్నది ఆరోగులకు తెలిసినప్పటికీ, ఆ సంగతి ఆ రోగుల బంధువులకూ తెలిసినప్పటికీ, అక్కడంతా జీవితం తాలూకు చలనం కనిపిస్తూ వుండటం, జయలక్ష్మికి ఆశ్చర్యం కలిగించింది. ఆమె చూస్తూవుండగానే, సీతారామారావు చిన్నాన్న వెంకటప్ప, పాలు తాగి విశ్రాంతికన్నట్టు వెనక్కివాలిపోయి, ప్రాణం విడిచాడు. బ్రతికి వుండాలన్న ఆరాటం లేదు, చావబోతున్నందుకు భయపడినట్టూ లేదు. పాలు తాగడం మామూలు విషయమైనట్టే, ప్రాణం పోవడమూ మామూలు విషయమే! క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్ళివచ్చినప్పటినుంచీ జయలక్ష్మిలో మృత్యుభయం మరోదశకు చేరుకుంది. తన శరీరంలో ఏ భాగంలోనో క్యాన్సర్ ప్రవేశించిందేమోనన్న అనుమానం. నేను చావబోతున్నానా, అప్పుడే చావా, ఇంకా ఏమీ అనుభవించనే లేదే అన్న జీవితంపై ఆశ ఒక వైపు, నేను లేకపోయినా ఈ ప్రపంచం ఇలాగే వుంటుందా, ఈ పచ్చని చెట్లు, ఈ నీలాకాశం ఇంత అందం ఇలాగే వుంటుందా? వీటిని చూసేందుకు నేను మాత్రం వుండనా? నేను లేకపోయాక ఇదంతా ఎందుకు? నశించాలి... ఈ విధంగా 'తన' నుంచీ వ్యాపించే స్వార్థం ఒక వైపూ ఆమెను కల్లోలపరుస్తాయి.

ఈ ఆలోచనల్తో ఆమె గుండె బలహీనపడింది. "జాగ్రత్తగా వుండాలి. ఈసారి గుండెనొప్పి వస్తే ఏమవుతుందో చెప్పలేము" అని డాక్టర్ హెచ్చరించడం విన్నది. తాను క్యాన్సర్‌తో కాదు, గుండెజబ్బుతో చచ్చిపోతుందన్నమాట. ఇన్నాళ్ళూ మృత్యువునూహించి పడినభయం, ఇప్పుడు దాదాపు మృత్యువు నిర్ధారణ కావడంతో, భయం చీకటి విచ్చినట్లయింది.

మృత్యువునూహిస్తూ, జీవితాన్ని మృత సమానం చేసుకున్నానన్న ఎరుక ఏర్పడింది. ఇప్పుడామెకు తమ ఇంటి వెనకవున్న శ్మశానాన్ని చూసి భయం వెయ్యడంలేదు. ఇతర చోట్ల ప్రకాశిస్తున్న సూర్యకాంతి అక్కడా ప్రకాశిస్తోంది. ఇక్కడ వీస్తున్నగాలే అక్కడా వీస్తోంది. ఇక్కడి సహజత్వమే అక్కడా వుంది. అంటే, జీవితమూ, మృత్యువూ రెండూ సహజమే. తను లేకున్నా ఈ ప్రపంచం ఇలాగే వుంటుందనీ, ఈ మనుషులూ, చెట్లూ, పక్షులూ, సూర్యుడూ, ఆకాశమూ వుంటాయనీ అనుకుంటూంటే ఆనందం కలుగుతోంది. 'పెంజీకటికవ్వల' కనిపించిన వెలుగు అది. దాన్ని జ్ఞానం అందామా? ఆనందం అందామా? ఏదన్నా ఒకటే. వెలుగుకి ప్రత్యేకమైన ఆకారం ఏముంది?

సామాన్య పాఠకులకు కథలో వున్నదంతా అర్థంకాని తాత్త్విక చర్చగా, విశ్రాంతజీవుల అనవసరపు ఆలోచనలుగా కనిపించవచ్చు. ఆలోచనాపరులైన పాఠకులు కూడా కథ నిరాశావాదాన్ని ప్రకటిస్తున్నట్టు పొరపాటు పడే అవకాశముంది. అది నిరాశావాదం కాదనడానికి ఈ వాక్యాలు తిరుగులేని సాక్ష్యాలు.

"ఒక శరీరంలోని సహజమైన కణాలన్నిటిమధ్యన ఒక ప్రాణం, ఒక నియమం. ఒక సంబంధం వుంటుంది. సంబంధం తప్పిపోయినవి అసహజమైన క్యాన్సర్ కణాలై అస్తవ్యస్తంగా పెరిగిపోయి శరీరాన్నే నాశనం చేస్తాయి. ఈ మానవ జాతి కూడా ఎదుటి మనిషితోనూ అతని సుఖదుఃఖాలతోనూ, కష్టనిష్ఠూరాలతోనూ సంబంధం కోల్పోవడాన్ని రోగగ్రస్తమైపోతున్నది.స్వామీ! మానవ జాతిని క్యాన్సర్ పుండుగా మార్చకు. ఏడ్చే నవ్వేమనుషులుగా, ఎదుటివాళ్ళను అర్థం చేసుకునే వాళ్ళుగా వుండనీ".

'పెంజీకటి కవ్వల' వున్న 'బ్రిడ్జిక్రింద' అన్న కథ కూడా మంచి కథ. "కొసమడి-దాన్ని చేత్తే బొమ్మిడీలు కొట్టుకుని పోవాల్సిందే"నని కొడుకు పోతప్ప చెప్పినా వినకుండా "బతికేద్దామన్న ఆత్రంతో" పోతప్పనాయన ఎనిమిదెకరాల మడి కౌలుకుతీసుకున్నాడు. ఇంటిల్లిపాదీ ఆర్నెల్లపాటు ఎద్దుల్లా పనిచేసినా, నీళ్ళు లేక పైరు ఎండిపోయింది. పెట్టుబడి అప్పుతీర్చలేక పోతప్పనాయన ఉరిపోసుకొని చచ్చిపోయాడు. (అనంతపురం జిల్లాలో పాతికేళ్ళ క్రిందటే రైతుల ఆత్మహత్య ప్రారంభమైన సంగతి, వసుంధరాదేవి చెప్పారన్నది గమనార్హం.) "ఈ సోట్లోవుండి బాగుపడ్డోడు ఎవడు? టవునుకుబోయి యాపనన్నాసేసి మడిసిగా నిలబడతాను" అని పోతప్ప నిర్ణయించుకుని, అనంతపురం కొత్తూరు ప్రాంతానికొచ్చి, రిక్షాతొక్కడం ప్రారంభించాడు. మళ్ళావారానికల్లా నెలకు అయిదు రూపాయల అద్దెకు ఒక కొట్టం తీసుకుని, భార్యలచ్చుమును, కొడుకు ఉజ్జప్పనూ తెచ్చుకున్నాడు.

పోతప్పకు చలపతి అనే అతన్తో పరిచయం అయింది. సమాజ పరిస్థితి గురించి చలపతి చెప్పేమాటలు వింటూంటే, "మంచోడే, రొవంత తిక్క" అనిపించింది. కొత్తూరు కాలనీ మొదట్లో దర్జాగా వుండేది. బ్రిడ్జికట్టిన తర్వాత, దాని దర్జాతగ్గింది. పోతప్ప ఆ బ్రిడ్జి పరిసరాల్లో రిక్షాతొక్కుతూంటే, పోతప్ప భార్యతమలపాకుల తట్ట ముందేసుకుని బ్రిడ్జికింద కూర్చుంటూ జీవనం సాగిస్తుండగా, అకస్మాత్తుగా పోతప్ప చెల్లెలు బేరమ్మా, మొగుడు అంజనప్పా, వాళ్ళ అరడజను పిల్లలూ దిగారు. అంజనప్ప వట్టి 'కాటా'గాడు, కష్టపడి బతికేరకం కాదు. పోతప్ప పెంచుకుంటున్న పొట్టేలు పిల్లను అమ్మేసి సారా తాగి పడుకున్న అంజనప్పను పోతప్ప కొడుతుండగా చూసిన పోలీసులు పోతప్పను తీసుకెళ్ళి లోపల తోసారు. తప్పుచేసిన అంజనప్పను విడిచి పెట్టారు. పోతప్పను బయటికి తెచ్చేందుకు అతని భార్య ఇంకోపొట్టేలు పిల్లను అమ్మీ, మరికొంత అప్పుచేసీ పోలీసులకు లంచం ఇవ్వవలసి వచ్చింది.

బయటికొచ్చిన పోతప్పకు ఈ సంగతి తెలిసాక, చలపతి చెప్పినమాటలు జ్ఞాపకం వచ్చాయి. ఇప్పుడు తన బాధ చెప్పుకునేందుకు చలపతీ లేడు. 'తిక్క' అనుకున్నాడు కానీ చలపతి చెప్పిందే నిజం. బాధభరించలేక, మొట్టమొదటిసారి సారాతాగేసి, ఆ ప్రభావంతో కొంత అల్లరి చేస్తాడు పోతప్ప. ఆ స్థితిలోనే ఎదురుగా వున్న ఆర్.టి.వో. శంకరరెడ్డి కారు షెడ్ తడికలులాగిపడేసి, గొడవ చేస్తాడు. ఆ శంకరరెడ్డి తన చెల్లెలు బేరమ్మ వుండిన స్థలాన్ని ఆక్రమించి తన కారుషెడ్ చేసుకున్నాడు. మళ్ళీ పోలీసులు ప్రవేశించి పోతప్పకోసం గాలించసాగారు. ఈసారి పోతప్పను పట్టుకపోకుండా

తప్పించేందుకు, పోతప్ప భార్య ఇంట్లో వుండే బిందె, చెంబులాంటి వసువుల్ని కూడా అమ్ముకుని, పోలీసులకు డబ్బు సమర్పించుకోవలసివచ్చింది.

'కష్టపడి యాపనన్నా చేసి, మడిసిగా నిలబడతాను' అనుకుని పట్నం వచ్చిన పోతప్ప ఇప్పుడు మతిలేనట్టు కూర్చుండి పోయడు. తనకు జరిగిన అన్యాయానికి ఇంతకుముందటిలాగా ఆగ్రహం ప్రకటించే పరిస్థితిలో కూడా లేడిప్పుడు. ఇకముందు పోతప్ప ఏమవుతాడు? 'యాపని' చేస్తాడు? తాను ఇంతవరకూ అసహ్యించుకుంటూ వచ్చిన 'కాటా' గాడుగా మారిపోతాడా? లేక, వాళ్ళ నాయన మాదిరే ఉరిపోసుకుని చచ్చిపోతాడా? ఏమైనా కావచ్చు. "ఏ పనైనా చేసి, మనిషిగా నిలబడతాను" అన్న ధైర్యమూ, ఆత్మ విశ్వాసమూ నశిస్తే, మనిషి ఏమయినా అవుతాడు కానీ మనిషిగా నిలబడలేడు. ఆ విధంగా మనిషిగా నిలబడగలిగే ధైర్యాన్ని సమాజం ఇవ్వడం లేదుకదా, దాన్ని నాశనం చేస్తోంది! ఇదీ 'బ్రిడ్జికింద' కథ.

ఆ పేరులో ఒక ప్రతీక వుంది. మనిషిని ఎదగనీకుండా చేస్తున్న అణచివేతకు ప్రతీక అది. "క్రింద ప్రాకులాడుతున్న మనుషుల్ని లెక్క చెయ్యకుండా, వాళ్ళకందని చోటపైన వున్నది బ్రిడ్జి. దాని ముందు అన్నీ నలుసులు. పైన పోయేకారుల్ని, బస్సుల్ని తప్పించి క్రింద వున్న ప్రాణుల్ని తుస్కారించినట్టుంది. భూమ్మీద బ్రతుకుతున్న పేదజనం మీద నిలబడి వాళ్ళని అణచేస్తున్నట్టుగా వుంది. కంట్రాక్టర్లు, ఇంజనీర్లు ఇంకా ఎందరో పెద్దలు మరింతగా బలుస్తూ, బక్కజనం మీద నిలబెట్టారు దాన్ని" ఈ అభివర్ణన పాలనాయంత్రాంగంతో కూడిన, నిర్దయాత్మక, నిర్ణయాత్మక 'రాజ్యం' (స్టేట్)ని సూచిస్తోంది.

'చెరువు దగ్గర', 'పెంజీకవ్వల', 'బ్రిడ్జికింద' ఈ మూడు కథలూ తెలుగు కథా సాహిత్యంలో వసుంధరాదేవి ప్రత్యేకతని చాటేవని చెప్పవచ్చు. ఆమె ఈ మూడు కథలేరాసి వున్నప్పటికీ, ఆమెను గొప్ప కథకులుగా గుర్తించవలసే వుంటుంది. ఈ మూడు కథల్లో గాక, ఇతర కథల్లో ఆమె ప్రత్యేకత కనిపించడం లేదా? తప్పకుండా కనిపిస్తుంది. కథను గురించిన అభిప్రాయం ఏదైనప్పటికీ కథ చెప్పడంలోనూ, కథ ద్వారా మానవజీవితాన్ని పరిశీలించడంలోనూ ఆమె ప్రత్యేకత కనిపిస్తూనే వుంటుంది. మనిషి చుట్టూ వుండే బాహ్య ప్రపంచాన్ని పరిశీలించడం కన్నా, మనిషిలోపల వ్యక్తావ్యక్తంగా వుండే ప్రపంచాన్ని పరిశీలించడంలోనే ఆమెకు ఆసక్తి. లోపలి ప్రపంచం బాహ్య ప్రపంచం ప్రతిఫలనం కాదా అనేది వేరే చర్చ. అందులోనికి వెళ్లకుండా (వెళ్తే దారితప్పతాం) మనం ఆమె మరి కొన్ని కథల్ని గురించి చెప్పకుందాం.

నిర్మలకు ఇంట్లోపని చేసే భాస్కరంని చూస్తే ఏదోభయం. భాస్కరం, నిర్మల భర్త ఆఫీసులో స్వీపర్ ఉద్యోగం చేస్తూ, ఇటు వాళ్ళింట్లోనూ పని చేస్తుంటాడు. "అవతలి మనిషికి ఏది అవసరమో, ఏం చేస్తే ఆ మనిషిని మెప్పించవచ్చునో, ఏం చేస్తే కోపం వస్తుందో అన్నీ గుర్తించగల" భాస్కరంని చూస్తే... అతను బతకడం కోసం ఏపనైనా చెయ్యగలడనీ, అవసరమొస్తే తన తల బద్దలు కొట్టగలడనీ, నిర్మల నిర్ణయం.

"నిర్మలకు నీడలంటే భయం, ద్వేషం. నీడలకోచిత్రమైన గుణముంది. అవి ఒక దాంట్లోకి మరొకటి పాకిపోతాయి. వస్తువుయొక్కప్రత్యేకతని కుదించి వేస్తాయి, మలినం చేస్తాయి". నీడలా అనుసరించే భాస్కరంని చూస్తే, అందుకేభయం, చిరాకు.

ఇంట్లో ఏవస్తువు పోయినా, పనివాళ్ళను అనుమానించే తల్లితో పోట్లాడింది ఒకప్పుడు. ఇప్పుడు తన ఇంట్లో వస్తువుపోయినప్పుడు అలా వుండలేకపోతోంది. పనిమనుషుల్ని అనుమానించి అడగనూ లేదు, ఆ వస్తువు పోతే పోయిందిలే అనుకోనూ లేదు. "అందువల్ల ఎన్నో విషయాలు ఆమె మనసులో నీడల్లాగా నిజం కాకుండానూ, అబద్ధం కాకుండానూ వుంటాయి". బాత్‌రూమ్‌లో వుండే స్టీలు చెంబుపోతే, పనిమనిషి చంద్రను అనుమానించింది. అయితే, అడగలేక పోయింది. నిర్మలకు చంద్రమీద అనుమానం వున్నట్లు గ్రహించిన భాస్కరం, నిర్మల మామగారి జేబులో డబ్బు పోయిందేమో చూసుకోమని చెబుతాడు. చూస్తే, నిజంగానే డబ్బుపోయింది! చంద్రను అడిగితే, ఆమెనాకు తెలీదంది. కానీ, ఆమెఎక్కడోదాచి పెడుతూంటే చూసి తెచ్చానని, భాస్కరం ఆ డబ్బు తెచ్చి నిర్మలకు ఇచ్చాడు. చంద్రను బాగా తిట్టినట్టు కూడా చెప్పాడు.

అయితే, అతనే చంద్రకు మళ్ళీ జీతం కూడా ఇప్పించాడు. అంతకు ముందు చంద్రను అతను తిట్టినట్టు కనిపించనేలేదు. దాన్తో, మళ్లీ నిర్మలలో అనుమానపు నీడలు. అసలు తన మామగారి జేబులో డబ్బు పోయినట్టు భాస్కరంకు ఎలా తెలిసింది? చంద్రను తిట్టానన్నవాడు చాటుగా ఆమెతో మంతనాలెలా జరిపాడు? అనుమానం లేదు, వీడూ ఈ దొంగతనంలో భాగస్తుడే. అయితే, తనమనసులో ప్రవేశిస్తున్న అనుమానపు నీడలు ఎక్కణ్ణుంచి వస్తున్నట్టు? అల్పమైన వస్తువులకు విలువల్ని నిర్ణయించి మనుషుల్ని అనుమానింప చేస్తున్నదేమిటి? ఈ ప్రపంచంలో బ్రతికే మనిషి 'మనసా' నిర్మలంగా వుండటం సాధ్యమా? "ఈ ప్రశ్నలకు జవాబు కోసం ఆమె మనస్సు మూలం దగ్గరికి వెళ్ళినా అందుకోలేకపోయింది".

'ఏదో వస్తువు పోయినంత మాత్రాన పనిమనుషుల్ని అనుమానించకూడదు అనేది ఆమె స్వభావం, లేదా సంస్కారం. వస్తువుకు విలువను నిర్ణయించేది సమాజం - ఒకప్పుడు తన తల్లికి విలువైన వస్తువులుగా కనిపించినవి తనకు విలువైనవి కావు. ఇప్పుడు తనకు విలువైనవిగా కనిపిస్తున్నవి, రేపు తన పిల్లలకో, ఇతరులకో విలువైనవిగా కనిపించవు. వస్తువుకు విలువను నిర్ణయించే అప్పటి సమాజ ప్రభావం మనసు మీద పడకుండా వుండదు. "ప్రపంచంలో బ్రతికేమనిషి 'మనసా' నిర్మలంగా వుండటం సాధ్యం" కానిది అందువల్లనే. ప్రపంచానికీ, మనిషికీ (అదే మనస్సుకూ) వుండే సంబంధాన్ని సమన్వయ పరచి చూసుకోకుండా, కేవలం మనస్సును గురించే ఆలోచిస్తే, సమాధానం ఎలా దొరుకుతుంది? అందుకే నిర్మల తన ప్రశ్నలకు సమాధానం అందుకోలేక పోయిందనిపిస్తుంది. ఈ కథ 'నీడలు' అని వేరే చెప్పనక్కర్లేదు.

"అమెరికా వచ్చిన మొదట్లో మనో ఒక చోటి నుండి పీకి మరో చోట నాటిన మొక్కలా బాధపడింది". కానీ, క్రమంగా ఆ బాధ చల్లారిపోయింది. అమ్మ చనిపోయింది. "ఇండియాకు వెళ్ళి అయిదేళ్ళయింది. ఇప్పుడు వెళ్ళాలంటే నీరసం; అయినా, ఇండియాలో ఏముంది? పేదరికం, మురికి, ఆత్మవంచన, అసమర్థత, అంతే. ఎప్పుడో ఒక సారి బాల్యస్మృతులు కనిపిస్తాయి కానీ, ఆమె మనసు వాటిని గుర్తించదు. అవి అప్రస్తుతమై, అటకెక్కిన దేవుళ్ళపటాలు. బావున్నప్పటికీ వాటి 'వునికి' లేదు. మామయ్యను పెళ్ళి చేసుకుని, పూజలూ వ్రతాలతో కాలం గడపుతున్న అక్క ధర్మతోనూ అట్టే సంబంధం లేదు. అందువల్ల ధర్మ నుంచి వచ్చిన ఉత్తరాన్ని అనాసక్తిగా, తాపీగా చదువుకుంది.

తనకు 'లుకేమియా' అని డాక్టర్లు తేల్చారట. నాన్నగారి గడియారం నీకు పంపిస్తున్నాను, ఇంకా బాగా పనిచేస్తోంది, బంగారపు పూత మాత్రం పోయింది, కావాలంటే పూతవేయించుకో... అని రాసింది. ఇక ధర్మ వుండదనుకుంటే కన్నీళ్ళొచ్చాయి. ఆ గడియారం అక్క తీసుకుందనే ఆమె మీద అక్కసుగా వుంది ఇంతవరకూ. ఒక్క క్షణం తన ఉద్యోగ జీవితమూ, దేశాంతరవాసమూ, సంసారమూ అంతా మిథ్య అనిపించింది. మళ్ళీ, తన నాగరికత, తన విజ్ఞానం "ఏమిటీ బేలతనం?" అని మందలించాయి. "సైకియాట్రీ పుస్తకాల్లో, ఆరోగ్యవంతమైన మనస్సు గొప్ప దుఃఖం నుంచి ఎంత సమయంలోగా కోలుకుంటుందో వ్రాసి వుంది". మనోది ఆరోగ్యవంతమైన మనస్సు. అందువల్ల వెంటనే కోలుకుంది. ధర్మ చచ్చిపోయినట్టుగానే నిర్ణయించుకుని, తన దైనందిన కార్యక్రమంలో పడిపోయింది.

ఆ కఠినత్వం మనల్ని దిగ్భ్రాంతి పరుస్తుంది. 'అయ్యో..." అనుకుంటాం. కానీ, మనం అనుకుని ఏం లాభం? "రాగద్వేషాలను తీరిగ్గా నెమరువేసుకుంటూ, తనకు తానేకితకితలు పెట్టుకునే సోమరి బుద్ధిలేదు మనోకి". కనుక, మనం గిలగిలలాడి లాభంలేదు. వెనక్కితిరగడం సాధ్యంకాని 'గడియారం' జీవితం అది. వసుంధరాదేవి ఇన్ని కథల్లోనూ, కొన్ని పరిశ్రమలేని కథలూ వున్నాయని చెప్పక తప్పదు. వాటిని పేరు పేరునా చెప్పకోలేము కానీ, 'వేషం' పేరుతో ఒక్క కథను ఉదాహరణగా చెప్పకుందాం.

ఇందిరకు మేనత్త కొడుకైన నాగయ్య బావ ఏదోపని మీద ఆవూరు వస్తూ, వాళ్ళమ్మ ఇచ్చిన ఆవకాయ జాడీని ఇందిరకివ్వడానికి వచ్చాడు. నల్లగా, సన్నగా, కడ్డీలాగా వుండి, తన కంటే పదిహేనేళ్ళు పెద్దవాడైన నాగయ్య బావ వద్ద ఆమెకు చనువులేదు. చాలా కాలానికి పుట్టింటి సమాచారం తెలుసుకోవచ్చని ఉత్సాహపడింది కానీ, అదేపనిగా బీడీలు

కాలుస్తూ, ముభావంగా, మొరటుగా వున్న అతణ్ణి చూస్తూంటే ఉత్సాహం చల్లారిపోయింది. అతను మొదట్నించీ విప్లవకారుడు. "ఈ సారి హిట్ లిస్టులో మామయ్య వున్నాడు" అని, దయా, జాలీ లేకుండా చెప్పినవాడతను. మామయ్య అంటే ఇందిర తండ్రే.

అతన్తో మాట్లాడ్డం అసాధ్యంగానేవున్నా, రాత్రికి వుండమనీ, క్యాంపు నుంచి తన భర్త కూడా వస్తాడనీ చెప్పింది ఇందిర. "పనుంది, వెళ్ళాలి" అన్నాడతను. అన్నట్టే నిమిషాల్లో ఎండనబడి వెళ్ళాడు. అతను వెళ్ళక ముందు ఓ సంఘటన జరిగింది. జవాను చంద్రయ్య వచ్చి, తన భార్య ఆరోగ్యం సరిగాలేక సెలవు కావాలంటే, జీతం నష్టం మీద అయ్యగారు వెళ్ళమంటున్నారనీ, మీరు అయ్యగారికి సర్ది చెప్పమని... ఇందిరను కోరాడు. అవసరం కొద్దీ, అయ్యగారు దేవుడు... అని కూడా పొగిడాడు. నాగయ్య బావ ముందు ఇది జరగడం ఇందిరకు తృప్తిగా వుంది. ఆ తృప్తిని ఎగరగొడుతూ, "మీరు దయ చూపించే దేముళ్ళుగా వుంటున్నారన్నమాట" అని నాగయ్యబావ వ్యాఖ్యానించాడు. "దయ మావేషం అయితే, విప్లవం నీవేషం" అనుకుంది ఇందిర కోపంగా.

ఆ తర్వాత, నెల కల్లా ఎన్‌కౌంటర్లో నాగయ్య చనిపోయినట్టు ఇందిర పత్రికల్లో చదువుకుంది. ఇందులో వేషం ఎవరిదో తెలీదు. విప్లవం వేషమేననడమా? లేక, తాను వేషం అనుకుని పొరపాటు పడినట్టు ఇందిర గ్రహించడమా? విప్లవం వేషమేనంటే, ఎన్‌కౌంటర్లో మరణించడమూ వేషమేనా? నాగయ్య శారీరక, మానసిక వర్ణన చూస్తే, రచయితకు అతని మీద గౌరవం లేనట్లేననిపిస్తుంది. ఆ విధంగా అనుకుంటే, అలాగే చెప్పవచ్చు. కానీ, విప్లవం గురించికానీ, విప్లవకారుడి గురించికానీ ఏమీ తెలుసుకున్నట్టు కనిపించదు. విప్లవకారుడికి బీడీలు తాగడం లక్షణమా? దయా, జాలీలేని విప్లవకారుడికి, మేన కోడలికి ఆవకాయ జాడీ మోసుకొచ్చి ఇచ్చే 'ప్రేమ' వుంటుందా? "ఆవకాయ కావాలంటే వాళ్ళు కొనుక్కోలేరా?" అనడా?

ఇక 'హసీనా' అనేపేరుతో వున్న అయిదుపేజీల చిన్న కథలో చెప్పిన విషయం కన్నా, సూచన చేసి, ఆలోచనకు వదలిన విషయమే ముఖ్యమైనదిగా వుంది. హసీనా పనిచేసే ఒక ఇంటి యజమానురాలు చెప్పినట్టుగా, ఉత్తమ పురుషలో చెప్పిన కథ ఇది. వసుంధరాదేవి కథలో ఎక్కువ కథలు ఉత్తమ పురుషలో చెప్పివున్నాయి. అంతర్వీక్షణకు అది అనుకూలమైన కోణం అని వేరే చెప్పనవసరంలేదు.

హసీనా భర్త సుభానీకి 'వాసెక్టమీ' వికటించి, బరువు పనులకు పనికిరాకుండా పోవడంతో ఉద్యోగం పోయింది. అప్పటికే వాళ్ళకు ఆర్గురు కొడుకులు. వాళ్ళు లేత రెక్కల ప్రాయంలో వుండగానే, ఏ హోటల్లోనో చాకిరీకి పెట్టేస్తారు. ఆ విధంగా వాళ్ళకు అన్నం పెట్టే బాధ్యత తీరిపోవడంతోపాటు, అంతో ఇంతో జీతం కూడా తెస్తారు కనుక, ఆ డబ్బుతో హసీనా సినిమాలు చూస్తూ, "పైలాపచ్చీసుగా కనిపిస్తుంది". హసీనాది ఆకర్షణీయమైన రూపం. "మొగుణ్ణి వదిలేసి దూదేకుల వాడితో లేచిపోయింది" అంటాడు త్రిమూర్తులు.

హసీనా మాత్రం, తన భర్త, పిల్లల క్షేమం కోసం రంజాన్ ఉపవాసాలు చేస్తుంది. దస్తగిరి స్వామి మొక్కుతీర్చుకోవడానికి, మేకను కోయించి ఫకీర్లకు విందుచేస్తుంది. తన నాలుగో కొడుకును, ఎనిమిదేళ్ళవాడిని కొత్త వాడిని కొత్త హోటల్లోపనికి పెట్టినట్టు, యజమానురాలతో (ఆమె తన ఇంటికే యజమానురాలు కానీ, హసీనాకు ఎంత మాత్రం కాదు) నవ్వుతూ చెబుతుంది. యజమానురాలి మూడేళ్ళ కొడుక్కు విరేచనాలు పట్టుకుంటే, నమ్మకమైన నాటువైద్యం సూచిస్తుంది. ఆ వైద్యం ఏమిటంటే, వెల్లుల్లి రెబ్బను కాల్చి వాతపెడితే, విరేచనాలు కట్టుకుంటాయట! "అలాగా వాళ్ళ మూర్ఖత్వం అలా వుంటుదన్నమాట" అనుకుని, యజమానురాలు నవ్వింది. "ఇలాంటి వైద్యాలు చేసే మీరు పిల్లల్ని పాడు చేసుకుంటారు. వెంటనే డాక్టర్ల దగ్గరికి తీసుకువెళ్ళాలి" అని సలహాఇచ్చిందామె. అటువంటివైద్యం సూచించినందుకు సిగ్గుపడలేదు హసీనా. పైగా, యజమానిరాలి హేళనతో కూడిన నవ్వును లెక్కచెయ్యకుండా, "ఏమాత్రం తొణక్కుండా, సన్నని పెదాలు

బిగబట్టి" అంది. ఏమని? "డాక్టరు దగ్గరికి తీసుక వెళ్ళేందుకు డబ్బేవుంటే, ఇదెందుకు చేస్తాను" అంది. అప్పుడు హసీనాను చూసిన ఆ యజమానురాలే సిగ్గుపడవలసివచ్చింది. హసీనా పట్ల తాను అపచారం చేసానన్న భావం కలిగిందామెకు.

"అయితే, డబ్బు వుంటే తన పిల్లలకు వాతలు పెట్టకుండా డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళేదా? డబ్బుంటే తన పిల్లల్ని పసితనంలోనే పనికి పెట్టెయ్యకుండా కడుపులో పెట్టుకునేదా? ఇదంతా తెలిసీ ఇంకా నవ్వుతూ బ్రతకడానికి ప్రయత్నిస్తోందా? అయితే, డబ్బుంటే మూఢనమ్మకాలుండవా? అది కాదు ఈ కథకు అర్థం. డబ్బువుంటే, మూఢనమ్మకాలను అనివార్యంగా నమ్ముకోవలసిన అవసరం వుండదు. "ఇంతేలే పేదలు ఆశలు" కథలో కూడా వసుంధరాదేవి చెప్పింది ఇదే.

"ఇదంతా తెలిసీ ఇంకా నవ్వుతూ బ్రతకాలని ప్రయత్నిస్తోందా?" ఈ ప్రశ్నలో అసలు కథంతా వుందనిపిస్తుంది. కథ ప్రారంభం ఎలా వుందో జ్ఞాపకం చేసుకుందాం. "బుద్ధి పదునెక్కిన జీవులు జీవితంలో తమకు అందవలసినవన్నీ అందలేదనీ, అన్యాయం జరిగిపోతున్నదనీ భావించినప్పుడు ఏదోవన పోతారో అందులోకి అడుగుపెట్టాను నేను". ఆదోవ ఏది? తమకు అందవలసిన వన్నీ అందలేదనీ, ఇతరులకు అన్నీ అందుతున్నాయనీ అనుకున్నప్పుడు,... ఆ 'ఇతరులు' అన్యాయంగా అందుకుంటున్నట్టు, అవినీతి పరులైనట్టూ కనిపిస్తారు. అటువంటి వాళ్ళున్న ప్రపంచం, లేదా వ్యవస్థ నాశనమైపోవాల్సిందే" అని కోరుకుంటారు. అది 'నాశనం' దోవ.

మళ్ళీ వాళ్ళ నీతి ఎటువంటిది? తన భర్త నీతి పరుడుగా వుండకుండా 'లోకరీతి'గా పోయివుంటే, అందవలసినవన్నీ అందేవి కదా... అన్నదే. అవుటయిన పేపర్లు తనకెవ్వరూ తెచ్చి ఇచ్చే వాళ్ళు లేరని కూతురు బాధ పడుతూంటే. అది కూడదనకుండా, తనూ బాధపడే నీతి. పేదవాళ్ళను 'అలగాజనం' అనుకునే నీతీ. అలగాజనానికి నీతి నియమం వుండదనుకునే నీతే. తన కొడుక్కు విరేచనాలు వెంటనే కట్టకపోతే, వైద్యశాస్త్రాన్నే అనుమానించి, విరేచనాలు కడితే వైద్యశాస్త్రం గొప్పదని నమ్మే గాలివాటు నీతి. అదీ జీవితంలో తాము అనుసరిస్తున్న దోవ.

మరి హసీనా దోవ ఏది? డబ్బువుంటే తామిప్పడు వుంటున్న పద్ధతిలో వుండవలసిన అవసరం ఏమాత్రం లేదని తెలిసీ, డబ్బుకోసం అడ్డదారులు తొక్కకుండా పిల్లల్ని కూడా కష్టించడం తెలిసిన మనుషులుగా బతక నివ్వాలనే దోవ. తనకు అందవలసిన వన్నీకాదు, ఏవీ అందకపోయినా స్వాభిమానంతో, నవ్వుతూ బతికేదోవ. 'హసీనా' పేరు అందుకే ప్రతీక. "గర్వంగా సాగివున్న ఆమె మెడను ఆప్యాయంగా చుట్టకొని వుండి నల్లగా మెరిసిపోతున్న నల్లపూసలదండ శివుని మెళ్ళోని పాములాగా, ఆమెను సవాలు చేస్తున్న జీవితంలాగా ఆమెకు గొప్ప ఆభరణమై అందాన్నిస్తుంది".

హసీనా మెడలో వున్న నల్లపూసలదండ ఆమె పేదరికాన్ని సూచించేది. శివుడూ పేదవాడే. హసీనాను సవాలు చేస్తున్న జీవితం పాములాగా భయపెట్టేదే. అయితే, ఆమె భయపడటంలేదు. సవాలు చేస్తున్న జీవితాన్ని నవ్వుతూ ఎదుర్కొంటోంది. పేదరికం ఆమెకు ఆభరణమే అయింది కానీ క్రుంగదీసే భారంకాలేదు. అదీ కథాసూచన.

ఈ కథలో, ఆకులందున అణగిమణగివున్నట్టు, శిల్పంలో దాగివున్న మరో అంశమూ వుంది. కథ చెప్పిన ఆ యజమానురాలి పేరెక్కడా రాలేదు. ఆమె తన పేరు తాను చెప్పకోకపోవచ్చు. కానీ, ఎవరో ఒకరు ఆమెను ఆమె పేరుతో పిలిచినట్టులేదు. గుంపులో పోయే వాళ్ళకు పేరుతో పనేముంది? ఇక్కడ "బుద్ధిపదునెక్కిన" అనే మాటకు బుద్ధి నిశితమైన అనే సామాన్యర్థం రాదు. 'తన' గురించిన ఆలోచనల్ని పెంచుకుంటూ పోవడం... అనుకుంటున్నాను. ఆ పేరులేని ఆమెకు, అంటే ప్రత్యేకతలేని ఆమెకు "హసీనా మేరు పర్వతంలా కనిపించిం"దంటే, ఆశ్చర్యం ఏముంది? ఒక మామూలు ఇల్లాలి చాటునుంచీ రచయిత చాటిన మనోవిశ్లేషణ ఇది.

'ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు' అనుకోవడం తప్పనీ, అందరి కర్మకూ అందరూ బాధ్యులేననీ, సుఖం, దుఃఖమూ అన్నవి పరస్పరం వ్యతిరేకం కాక, సంబంధితాలనీ తెలియజేసేది 'షాకిరా' అన్నకథ.

ఈ కథ కూడా 'హసీనా' కథ మాదిరే, యజమానురాలి పరంగా చెప్పిందే. ఒక రకంగా హసీనాకు వ్యతిరేకమయింది షకిరా. అయితే, షకిరా సమస్య పేదరికంకాదు, ఒంటరితనం. ఆ ఒంటరితనం నుంచి తప్పించుకునేందుకు, తనను తాను ప్రత్యేకమైన మనిషిగా భావించుకుంటుంది, కాదు, భ్రమించుకుంటుంది. తాను కొంత మందికి రక్షకురాలిగా వుంటున్నట్టూ, వాళ్ళు చెడిపోకుండా చూసుకోవలసిన బాధ్యత తన మీద వున్నట్టూ, అనుకుంటుంది. క్రమంగా ఇవన్నీ వాస్తవాలు కావనీ, తను ఒంటరిది కావడమే వాస్తవమనీ... గ్రహించే అనుభవాలు ఎదురవుతాయి షకీరాకు. దాన్తో, తాను ప్రత్యేకమైన వ్యక్తినన్న సంతృప్తి కూడా కోల్పోయింది. ఈ పరిస్థితికి తోడు, యజమానురాలి ఇంట్లో డబ్బు పోవడంతో, ఆమె అనుమానం షాకిరాపైన పడుతుంది. ఆ డబ్బు ఒక పుస్తకంలో దొరకడంతో, యజమానురాలు తన తప్పని గ్రహించి, కనిపించకుండా పోయిన షాకిరా కోసం వెతుకుతుంది. కానీ, షాకిరా కనిపించదు. ఏమయిపోయిందో, ఎక్కడుందో తెలీదు.

ఈ అన్వేషణలో, దేవాలయాల వద్ద వున్న భిక్షకులను చూడవలసివచ్చింది. "వీళ్ళకీ బంధువులూ, కుటుంబాలూ, జీవితాలూ వుండి వుంటాయన్న విషయం చాలా ఆశ్చర్యం కలిగించింది. వాళ్ళు మనుష్యులని ఎవరికి గుర్తు? అప్పట్నించి ఎక్కడా భిక్షగాళ్ళ గుంపు కనిపించినా షాకిరా కోసం చూస్తాను. ఏదో అపరాధభావం కలుగుతుంది. ఆవిడ కర్మకి నేను బాధ్యురాలినా, నాకే సంబంధం, అనుకోలేకపోయాను" 'వసుదైవకుటుంబకం' అన్న పదాన్ని ఒక పదంగా కాక, దాని అర్థంతో చూసిన కథ 'షాకిరా'. ఈ కథ చదివాక, భిక్షగాళ్ళను చూసినప్పుడు, "వీళ్ళకూ బంధువులూ, కుటుంబాలూ, జీవితాలు వుండి వుంటాయి" అని ఆలోచించకుండా వుండలేము, ఎంతో కొంత మనుషులంగా మిగిలివుంటే.

మొత్తం మీద తెలుగు కథా రచయితల్లో వసుంధరాదేవికి ఒక ప్రత్యేకత వుంది. ఆమెను చదివే పాఠకులు కూడా ప్రత్యేకమైన వాళ్ళే అయి వుండాలి. వసుంధరాదేవి ప్రత్యేకత ఏమిటి? ఆమె కథల్లో పాత్రలు జీవించడం కన్నా, జీవితం గురించి ఎక్కువగా ఆలోచిస్తాయి. శరీరంతో జీవించడం కన్నా, మనస్సుతో ఎక్కువగా జీవిస్తాయి. దుఃఖాన్నో, సంతోషాన్నో బయటి ప్రపంచంనుంచికాక, తమ లోపలి ప్రపంచం నుంచే పొందుతాయి. జీవితాన్ని నిర్లిప్తతతో చూసినా, నిర్లక్ష్యం వుండదు. జీవితాన్ని, చావు, బ్రతుకులకతీతంగా, సుఖదుఃఖాదిక ద్వంద్వాతీతంగా దర్శించడం కనిపిస్తుంది. తల్లుల ప్రభావం, తర్వాత జీవితం మీద ఎంతగా వున్నప్పటికీ, ఎందుకనో తండ్రుల మీదనే గౌరవం! ('అమ్మా, ఇక సెలవు' కథ ఇందుకు మినహాయింపు).

ఈ సంకలనంలో చిన్న కథగా వున్న 'శివరావు కోట' అనేది, ఆ తర్వాత 'రెడ్డమ్మగుండు'గా రూపొంది, నవలికగా వచ్చింది. ఈ సంకలనాన్ని ఆర్.ఎస్. సుదర్శనంగారికి అంకితమివ్వడం కూడా సంతోషం కలిగించే విషయం. ఈ కథా సంకలనాన్ని శ్రద్ధగా చదవడం, ఒక అరుదైన సాహిత్య, తాత్త్విక అనుభవం, మరొక చెరగని అనుబంధం.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం శ్రీ విష్ణుభొట్లరామన్న గారి వదాన్య సౌజన్యంతో అందించబడింది.